


# మనిషి మిగిలాడు

అంతరాతరాల్లోకి ఎప్పుడో ప్రవేశించి, ఎక్కడో కాపురం ఉంటున్న రాక్షసుడు అప్పుడు పడగలు విప్పి బయటకు వచ్చేశాడు. వికృతంగా వికటాట్టహాసం చేస్తున్నాడు.

నర్సిమ్మ గునపం దెబ్బను గురిచూసి మరీ వేస్తున్నాడు.

పెళ్ళలు పెళ్ళలుగా గోడ బీటలు తీస్తూ, ఇటుకలు కిందకు రాలుతున్నాయి. నర్సిమ్మకు చెప్పలేనంత సంబరంగా ఉంది. ఇంకో అయిదారు దెబ్బలు వేస్తే గుమ్మం కూడా ఊడిపోతుంది.

ఆ గుమ్మానికి ఇంకా పచ్చదనం పోని మామిడాకులు తళతళా మెరుస్తూ వేలాడుతున్నాయి. ఆ గుమ్మానికి తడిఆరని పసుపు ఇంకా అందంగా కనిపిస్తూనే ఉంది. ఆ పసుపుమీద కుంకుమసైతం ఎన్నో రంగులీనుతూ కాంతుల్ని ప్రసాదిస్తోంది. పై నుంచి పడ్తున్న మట్టితో, సున్నంతో, ఇటుక పెళ్లలతో ఇపుడు పసుపు, కుంకుమలు అందాల్ని కోల్పోతున్నాయి.

– ఆ ఇంటికి కొంచెం దూరంలో...

కళ్ళల్లోంచి రక్తాన్ని చిందిస్తూ కమలాకరరావు నిలబడి ఉన్నాడు. అతనికి కొంచెం ప్రక్కనే అతని భార్యాపిల్లలు, వారికి ప్రక్కనే ఎన్నో సామానులు దిగాలుగా పడి ఉన్నాయి. జరుగుతున్న చోద్యాన్ని చూసేందుకు వచ్చిన వేలాదిమందితో బాటు వాళ్ళుకూడా ఆ దారుణాన్ని కళ్లప్పగించి చూస్తున్నారు.

తను కన్న కలలన్నీ క్షణాలమీద నాశనం అయిపోతోంటే కమలాకరరావుకు ఏం చేయాలో దిక్కు తోచకుండా ఉంది.

నిన్నటి వరకు రక్తాన్నీ, ఒంట్లోని శ్రమనూ, చెమటనూ రూపాయి బిళ్ళలుగా మార్చి, వాటికో రూపాన్ని ఇచ్చి, ఇటుకలుగా మార్చుకుని ఇంటిని కట్టుకొన్నాడు కమలాకరరావు. ఇపుడు అంతటి శ్రమా క్షణాలమీద... పేక మేడలా కూలిపోతోంది. ఒక్కో ఇటుకా పేర్చి కట్టుకున్న తన భవిష్యత్తు అంతా నాశనం అయిపోయింది.

ఎవరితో చెప్పుకోవాలి తను? ఏమి మొరపెట్టుకోవాలి తను??

... ఇందరు జనం... అందరికీ ఓట్లున్నాయి. అందరికి నోళ్ళున్నాయి. కానీ ఆ రెంటిలో ఏదీ మాట్లాడటం లేదీ క్షణంలో! మౌనంగా ఆ వినాశాన్ని వీక్షిస్తున్నారా జనం.

కమలకరరావుకు కడుపుకోత భరించలేనంతగా ఉంది.

దూరంగా ఆ చెట్టుకింద ఇంజనీరు నిలబడి ఉన్నాడు. ఆయన నిజానికి కన్‌స్ట్రక్షన్ ఇంజనీరు. చేస్తున్నది పూర్తి డిస్ట్రక్షన్!

... ఇంకో గంటన్నరలో గృహ ప్రవేశముహూర్తం అనగా వచ్చాడు ఇంజనీరు. సాదరంగా లోపలికి వెళ్ళటం ఇష్టంలేకపోయినా, లోపలికి తీసుకెళ్ళి ప్రతీ అంగుళాన్నీ చూపించాడు.

"బాగా కట్టారు ఇల్లు!" అన్నాడు ఇంజనీరు అంతా చూసి.

కమలాకరరావు నవ్వాడు. తృప్తితో ఆ అభినందనల్ని అందుకుంటూ.

వీధి గదిలోకి రాగానే అన్నాడు ఇంజనీరు ఆ మాట. కమలాకరరావు ఉలిక్కి పడ్డాడు. ఏం చెప్తున్నాడు అతను! తను విన్నది రైటేనా? అన్న అనుమానం అతనిలో క్షణంసేపు తలెత్తింది.

"సారీ మిస్టర్ కమలాకరరావ్! నా చేతిలో ఏమీ లేదు."

"కాదండి, నా మాట వినండి! ఎక్కడో పొరబాటు జరిగిపోయి ఉంటుంది! నాకు పర్మిషన్ ఉందండి!"

"చూపించండి, వెళ్ళిపోతాను! కాదంటారా, ఇదిగో, ఇది చూడండి, నాకొచ్చిన డిమాలిషన్ ఆర్డర్ – పూర్తి ఇంటిని అక్కర్లేదు. రోడ్డుమీదకు వచ్చేసిన ఆ ముందు గదీని, రేపు వైడెనింగ్‌కు అవసరం అయ్యే భాగంలో ఉన్న ఆ పక్కగదినీ... అంతే–మిగతా ఇంటిని మేం ఏమీ ముట్టుకోం!"

"అంటే...?"

ఇంజనీర్ ఏమీ మాట్లాడలేదు. దూరంగా ఆగి ఉన్న డిమాలిషన్ స్క్వాడ్‌ను చూపించాడు.

చేతితో అక్కడ లారీలో గునపాలు, పలుగులు, పారలు.. అన్నీ మనుషుల చేతుల్లో ఉన్నాయి. 'ఊ' అంటే విరుచుకు పడేందుకు సిద్ధంగా ఉన్నారు ఆ రాక్షసులంతా!!

"కానీ... నా దగ్గర పర్మిషన్ ఉందండీ, ఇక్కడ లేదు. అక్కడ అద్దెఇంట్లో పెట్టివచ్చాను! మీరు ఈ ఒక్కపూట గడువు ఇప్పిస్తే, మీ దగ్గరికొచ్చి రేపు చూపిస్తాను నేను దాన్ని!"

"మీకు పర్మిషన్ ఇప్పించింది కొండలరావేనా?"

"అవునండీ, అతనే" అన్నాడు కమలాకరరావు. మునిసిపాల్టీ ఆఫీసులోకి వెళ్ళగానే దర్శనం ఇచ్చే కొండలరావు అతనికి ఆ క్షణంలో గుర్తుకొచ్చాడు. డబ్బు ఖర్చు పెట్టినా ఆ ఆఫీసులో ఏ పనీ జరగదు. అలాంటి ఆఫీసులో ప్రజా సేవయే కర్తవ్యంగా బతుకుతున్న వ్యక్తి కొండలరావు. దీనికి ఇంత అంటూ లెక్కలు గట్టి చెప్తాడు. అన్నింటికీ ఊకొట్టి లెక్క ప్రకారం డబ్బు అప్పగిస్తే అన్ని పనులూ తనే చేయించుకొని వచ్చి మరీ పేపర్లు అందించేస్తాడు. ప్లాన్ అప్రూవల్‌కు తనకు మొత్తం రెండువేలు పైచిలుకే అయింది ఖర్చు. అయితేనేం, పని పూర్తయింది అని సంబరపడ్డాడు!

"కొండలరావు ఇలాంటి పన్లు చేస్తున్నాడని మాకెన్నాళ్ళనుంచో అనుమానం ఉండనే ఉంది. ఆఖరికి నిన్న పట్టుకొన్నాం! అతని ఇంటినిండా మా ఆఫీసు సీళ్ళూ, స్టాంపులూ! అన్నీ దొంగసంతకాలే! మీకు అతనివల్లే అప్రూవల్ వచ్చిందంటే, అది మీరు తేనక్కర్లేదు. అదీ దొంగపత్రమే, సారీ మిస్టర్ రావ్! మీరు సామాను తెచ్చుకొని బయటకు వచ్చేస్తే" కొంపకూల్చేస్తారంటున్నాడు ఇంజనీరు.

కమలకరరావుకు మతిపోయింది.

ఇన్నాళ్లకు వాళ్లు కళ్ళు తెరిచారట. ఇప్పుడు తన పని పడతారట! ఎంత అన్యాయం ఇది!! తమ కళ్ళ ఎదుటే జరుగుతూ వచ్చిన అన్యాయాన్ని ఇంతకాలం సహించినందుకు నిజానికి ఎవరికి వెయ్యాలి శిక్ష? కానీ.... ఇవన్నీ ఇపుడు అడిగే వీలులేదు. తను అడిగిన కొద్దీ దాన్ని ఛాలెంజిగా తీసుకొని మరీ రెచ్చిపోతారు.

"అసలు నిన్ననే రావాల్సింది ఇక్కడకు - కానీ కొండలరావు ఇలాగే దొంగపత్రాలు సృష్టించి పర్మిషన్ ఇచ్చిన ఇంకో రెండిళ్లు కూల్చటంలో ఆలస్యం అయింది!" 'పొరబాటయింది!' అన్నట్లుగా ఉంది ఆ ఇంజనీరు చెప్తున్నది.

"పోనీండి! కొంచెం సేపు ఆగండి! ఇంకోగంట ఆగితే నేను కోర్టునుంచి పర్మిషన్ తెచ్చుకొంటాను!"

"కోర్టుకే వెళ్తారో ఇంకెక్కడికైనా వెళ్తారో మీ ఇష్టం! కానీ మా పని ఆపే వీలులేదు. మీరు వెంటనే ఇల్లు ఖాళీచేయిస్తే...!"

కమలాకరరావు ముఖాన కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు. ఇంట్లోకి వెళ్ళి ఆ వార్త చెప్పాడు. గృహప్రవేశం సంగతి దేవుడెరుగు, ముందు ప్రాణాలు దక్కించుకొందామన్నాడు. అందరూ లబోదిబోమన్నారు.

ఇప్పుడు ఎవరి నోటా మాటరావటం లేదు. అందరికీ మాటాపలుకూ అన్ని పోయాయి, నిశ్చేష్టులై నిలబడి పోయారు.

– నర్సిమ్మ గునపాన్ని బలంగా గోడలోకి దింపుతున్నాడు. ఒక్కోదెబ్బకూ ఒకటి రెండూ ఇటుకలు పడుతూనే ఉన్నాయి. ఒక్కో ఇటుక పడినకొద్దీ ఇంకా కసి పెరిగిపోతోంది నర్సిమ్మకు.

నర్సిమ్మకు కసి ఆ ఇంటిమీదనే కాదు. అసలు అన్ని ఇళ్ళ మీదా ఉంది. ఒక్కరోజు తనకు పర్మిషనిస్తే అన్ని ఇళ్ళను ఇలాగే కూల్చి పారేస్తాడు. లేకపోతే ఏమిటిది! ఎలా కట్టేస్తున్నారు వీళ్ళు ఇలా ఇళ్ళను!! ఎక్కడ నుంచి వస్తోంది వీళ్ళకింత డబ్బు?? రోజురోజల్లా కష్టపడినా తనకింత తిండికి సరిపడేంత లభించటమే కష్టంగా ఉంది. వీళ్ళు ఎలా కట్టేస్తున్నారు ఈ మేడలు!

ఇన్ని ఆస్తిపాస్తులు వీళ్ళకు ఎలా ఉన్నాయా అనిపిస్తూ ఉంటుంది ఒక్కోసారి! కానీ వీళ్ళకు అవి మాత్రం ఎక్కడివి?

తను, తన తండ్రీ, తన తాతా... అందరూ ఇలాగే బతికారు. తరం గడిచిన కొద్దీ బీదరికం పెరిగిందే తప్ప ఆస్తిపాస్తులు పెరగటం లేదే! తాత మేస్త్రిగా ఉండేవాడట. తాపీ మేస్త్రిగా ఇళ్ళు కట్టించి ఇచ్చేవాడు. తండ్రి కూలీగా స్థిరపడ్డాడు. తాను.. తాను ఆఖరికి కూలీగా... అదీ ఇళ్లుకూల్చే కూలీగా మిగిలాడు.

కానీ... తన తాత తండ్రి అనుభవించని తృప్తి, తను అనుభవిస్తున్నాడు. ఇళ్ళు అందరూ ఎలా కడ్తున్నారు – ఇంకోడి పొట్ట కొట్టి! అనేది ఒక్కటే నర్సిమ్మకు తెలుసు. ఇంకో విధంగా డబ్బు సంపాదించే అవకాశమే లేదని నర్సిమ్మ నమ్మకం. అందుకే డిమాలిషన్ స్క్వాడ్‌లో చేరగానే నర్సిమ్మకు చెప్పలేనంత ఆనందం కలిగింది.

ఒక్కో ఇల్లు కూలగొడ్తుంటే చెప్పలేనంత తృప్తి అతనికి కలుగుతూ ఉంటుంది. తనలా ఎందరి పొట్టల్లో్ కొట్టి డబ్బు సంపాదించినవారికి తగిన శాస్తి చేస్తున్నానని అతనికి అనిపిస్తూనే ఉంటుంది.

మునిసిపల్ ఆఫీసు దగ్గర చేరేంతవరకు ఎక్కడికి వెళ్ళాలో చెప్పరు. ముందురోజు చెబితే ఎవరైనా వెళ్ళి ఆ ఇంటి వాళ్ళతో చెప్పేస్తారోనన్న భయం అధికారులకు! అందుకే లారీ కదిలాక.... ఆ లారీ ఆగాకనే తెలుస్తుంది ఏ ఇంటిని కూలగొట్టాలో!

– ఈ రోజు ఇది – ఇంకో గంటలో గృహప్రవేశంట! ఇప్పుడు ఇది!! ఇదిపుడు మూడో ఇల్లు తాము కూలగొడ్తున్నది! కొండలరావుకు వేలు వేలు అందించే జనాన్ని తల్చుకొంటే నర్సిమ్మకు నవ్వొచ్చింది.

'బాగా చేశాడు కొండలరావు!' అనుకొన్నాడు నర్సిమ్మ. అయినా కొండలరావు విషయంలో ఎందుకు గొడవొచ్చిందో? నిన్నటివరకు అందరూ కొండలరావుతో దోస్తీగానే ఉండేవారు. ఇపుడు ఎందుకు అతనంటే కోపంగా ఉన్నారో నర్సిమ్మకు అర్థం కాలేదు. ఏదో వాటాల్లో పేచీలు కాబోలు అనుకున్నాడు.

గోడలోకి గురిచూసి గునపం వేస్తున్నాడు నర్సిమ్మ. ఆ గునపం తన గుండెల్లోకి దిగుతున్నట్లుగా ఉంది కమలాకరరావుకు. ఆ గునపం కలవారి అవినీతిలోకి గురిపెట్టి కొడుతున్నట్లుగా ఉంది నర్సిమ్మకు!

ముందు వీధిగది గుమ్మం కూలిపోయింది. ఆ గుమ్మంలోంచే గృహప్రవేశం జరగాల్సి ఉంది. ఆ గుమ్మం కుప్పకూలి ఉంది, ఇటుకల పోగుమీద!

కూలీలందరూ వంచిన తలెత్తకుండా పనిచేసుకుంటూ పోతున్నారు. ఆ పని చెయ్యటంలో వారిలో చాలామంది అపరిమితానందం పొందుతూనే ఉన్నారు.

ఇదోరకం మనస్తత్వం. తమకు లేనిది ఇతరులకెందుకు ఉండాలనే తత్వం. తాము పొందలేనిది ఇతరులెందుకు పొందారనే బాధ, అసూయ అది!

ఆఖరికి - ఇంజనీరు చెప్పినట్లు ఆ గదికి ఆనుకొని ఉన్న మరో గదినీ పడగొట్టడం పూర్తి చేశారు. ఆఖరి దెబ్బగా నర్సిమ్మ మరోసారి గునపాన్ని ఆ మొండి గోడలమీద గుచ్చాడు. మరోరెండు ఇటుకలు కిందపడ్డాయి.

పని అయిందన్నట్లుగా అందరూ లారీలలోకి తమ పనిముట్లను విసిరేశారు.

గృహప్రవేశం ముహూర్తందాటి అరగంట దాటింది. వస్తున్న బంధువులంతా అవాక్కయి నిలబడిపోయారు.

'తప్పో.. ఒప్పో... జరిగినది పొరబాటే కావచ్చు, కానీ దానివల్ల ఇల్లు కూలగొట్టేస్తే వచ్చే లాభం ఏమిటి, ఏదో కొంత జుర్మానా వేస్తే సరిపోతుంది కదా' అనుకొన్నారు కొందరు.

'ఇంత శ్రమ పడ్డది ఒక్క కమలాకరరావే అయినా, అదీ దేశ సంపదలో ఒక భాగమే! దాన్ని నాశనం చేసుకోవటం తప్పేగదా!' అన్నారు కొందరు.

ఇంజనీరు మాత్రం ఏమీ అనలేదు. అనటానికి ఇంకేమీ లేదన్నట్లుగా వెళ్ళి లారీలో ముందు సీట్లో కూర్చున్నాడు.

నర్సిమ్మతో సహా కూలీలంతా వెళ్ళి చేతులు కడుక్కొంటున్నారు.

గృహప్రవేశం సమయంలో అవసరముంటుందనుకొని డ్రమ్ముల్లో పోసి నిలువ ఉంచుకొన్న నీరంతా కూలీలు చేతులు పెట్టటంతో మురికి మురికిగా అయిపోయింది. ఆ నీళ్ళు పనికిరావు.

మొండి గోడలతో, కూలిన గోడలతో ఉన్న ఇల్లు ఇక గృహప్రవేశానికి పనికిరాదు.

కమలాకరరావుకు కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. మునిసిపల్ లారీ నెమ్మదిగా కదిలింది.

నర్సిమ్మ ఆ ఇంటికేసి చూశాడొకసారి - గంట క్రితం ఆ ఇంటికీ ఇప్పటికీ అసలు పోలికే లేదు.

అతనిలోని రాక్షసుడికి కడుపునిండా తిన్నంత తృప్తి కలిగింది.

లారీ మునిసిపల్ ఆఫీసు దగ్గర ఆగింది. నర్సిమ్మ లారీలోంచి కిందకు దిగాడు. ఒళ్లంతా మట్టిగొట్టుకొని పోయింది. ఇంటికి పోయి చెంబుడు నీళ్ల నెత్తిన బోర్లించుకుంటేనేగానీ హాయిగా ఉండదు అనుకున్నాడు నర్సిమ్మ.

ఆఫీసు ముందు మరో లారీ ఆగింది. అదీ డిమాలిషన్ స్క్వాడ్ వాళ్లదే! అందులోంచీ కూలీలు దిగారు.

కూలీల్లోంచి సూరయ్య తిన్నగా నర్సిమ్మ దగ్గరికి వచ్చాడు. సూరయ్య కళ్లల్లో ఆత్రం, బాధ, "నర్సిమ్మా-గోరం జరిగిపోనాదిరోయ్!"

"ఏమయింది?" నర్సిమ్మ ప్రశ్నలోనూ ఆందోళన.

"ఇయ్యేల... మీ గుడిసెలన్నీ..."

– నర్సిమ్మకు అంతా అర్థమయిపోయింది.

ఆఫీసుకేసి చూశాడొకసారి నర్సిమ్మ. కళ్లలోంచి నీళ్లు రావటం లేదు. గుండెల్లోంచి బాధ పొంగుకొస్తోంది.

నోట్లోంచి బండబూతులు మొదలయినాయి. ఆఫీసులో ఉన్న వాళ్ళను పేరు పేరునా తిట్టనారంభించాడు నర్సిమ్మ.

తోటి కూలీలంతా నర్సిమ్మ దగ్గరికి చేరారు. నెమ్మదిగా సముదాయించే ప్రయత్నాలు చేయనారంభించారు.

దాంతో నర్సిమ్మకు ఇంకా కోపం పెరిగిపోయింది.

"ఎట్టొప్పుకొన్నర ఈ పనికి? మీకు చేతులెట్లా వచ్చినయ్! నన్నూ నా కుటుంబాన్ని వీధుల్లోకి తోసేందుకు మీకు మనసెట్లా ఒప్పిందిరా నా కొడకల్లారా..."

నర్సిమ్మను సూరయ్యే ఆపాడు.

"బాగుందిరో.. అది మా డూటీ, డూటీ చెయ్యొద్దంటావా ఏం? నీ ఇల్లయితేనేం, ఎవడిదైతేనేం? ఇపుడు పోయి వచ్చినవ్‌కదా మరి నువ్వు కూడా, ఇయ్యన్నీ ఆడ ఆలోచించినావా?

సూరయ్య అడిగినవి ప్రశ్నలే కానీ అవి గునపంపోట్లలా తగిలాయి నర్సిమ్మ గుండెల్లో.

పచ్చని ఇంటి తోరణాలు అతని కళ్లముందు కదలాడాయి. గాలికి అవి కదలుతోంటే ఒక్క గునపంపోటు పొడిచాడు. పచ్చని ఇల్లు ముక్కలయింది. కుటుంబం చెట్టు కిందకు చేరింది. ఇపుడు అదే గునపం ఇంకోడి చేతుల్లోంచి తన గుండెల్లోకి దిగితే...

... ఎంత బాధగా ఉంది!

చెట్టుకింద విలవిల్లాడుతూ పడిపోతున్న ఇంటికేసి దీనంగా చూస్తుండిపోయిన కమలాకరరావు కుటుంబం గుర్తుకొచ్చింది నర్సిమ్మకు.

ఆ క్షణంలోనే – అతని అంతరాంతరాల్లోకి ఎప్పుడో ప్రవేశించి ఎక్కడో కాపురం ఉంటున్న రాక్షసుడు క్షణాల మీద చచ్చిపోయాడు.

మనిషిగా మిగిలిన నర్సిమ్మ కళ్లలోని నీళ్ళను తుడుచుకుంటూ మరేమీ మాట్లాడకుండా తన గుడిసెకేసి నడవడం ప్రారంభించాడు. అక్కడ గుడిసె ఉండదన్న సంగతీ, చెంబూ, బొంతలతో రాములమ్మ చెట్టుకింద చేరి ఉంటుందన్న సంగతే నర్సిమ్మకు తెలుసు.

కానీ ఆ జ్ఞాపకాన్ని మర్చిపోయే ప్రయత్నాలు చేస్తూ ముందుకు నడిచాడు నర్సిమ్మ.

– *జాగృతి దీపావళి ప్రత్యేక సంచిక, 13.11.1982*